

# THE WORD OF TRUTH

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో,
మధ్యాహ్నం గం 2-30 ని

**ఇంగ్లీషు THE VOICE OF TRUTH**

సోమవారము 9-00 to 9-15 p. m.
బుధవారము 9-30 to 9-45 a. m.

**హిందీ — SATYA SUSAMACHAR**

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 p. m.
ఆదివారము — 1-30 to 1-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము, శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మళయాళం — THE VOICE OF TRUTH**

మంగళవారము, శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు
కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను
ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

**SATYA VANI**
**P.O. Box. 80**
**KAKINADA - 533 001**

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE — *Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **10** — మే **1983** — సంపుటి **3**

## సంపాదకీయము

### క్రీస్తు సంఘము ఒక డినామినేషనా?

*(Is the Church of Christ a Denomination?)*

క్రైస్తవ్యాన్ని గూర్చి నీవు ఎరిగియుంటే, క్రీస్తు అనుచరులమని చెప్పుకొనువారు రకరకాల గుంపులుగను, తెగలుగను, డినామినేషనులు (శాఖలు) గను విభజింపబడి యున్నారని నీవెరుగుదువు. వారొకరితో ఒకరు ఏకీభవించరని, ఒకరి నొకరు ఎదురాడుదురని దీని యర్థము. ఇదంతయు మానవోపదేశములకు లోబడుటవలన సంభవించినది. అట్టి దాని నంతటిని బైబిలు ఖండించుచున్నది.

క్రైస్తవ్యము క్రీస్తునందలి విశ్వాసముపైనను, ఆయన బోధలననుసరించి వాటికి లోబడుటమీదను ఆధారపడి యున్నది. ఎక్కడున్నను ప్రజలు ఆలాగు చేసినయెడల వారు ప్రభువున కొక స్థానిక సంఘ మగుదురు. అంటే వారు ఆ ప్రత్యేక స్థలములో ప్రభువును ఆయన చిత్తప్రకారము ఆరాధించి సేవించు క్రైస్తవులన్నమాట. ఆ ప్రత్యేక స్థలములో యున్న సంఘము క్రీస్తు సంఘము అని పిలువ

బడినది. ఒక పరిధ్యాలో, లేక దేశములో, లేక ప్రపంచములోయున్న స్థానిక సంఘములన్నియు క్రీస్తు సంఘములని పిలువబడినవి. తన కాలములో యున్న ఇట్టి స్థానిక సంఘములకు పౌలు వ్రాయుచు "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యని వ్రాసెను (రోమా 16:16).

దైవవాక్కు అయిన బైబిలు నొద్దకు మనం వెళ్ళితే క్రీస్తును గూర్చి ఆయన సంఘాన్నిగూర్చి మనం చదువగలము. క్రీస్తు ఒకే ఒక్క సంఘమును నిర్మింతునని వాగ్దానము చేసెను. ఆయన ఒకే ఒక్క సంఘమును నిర్మించెను. మత్తయి 16:18 లో ఆయన ఇట్లు చెప్పెను: "నా సంఘమును కట్టుదును". అపొ.కా. 2 లో మనము చూస్తే అక్కడ అపొస్తలులు జనసమూహములకు సువార్తను బోధించిరి. తత్ఫలితముగా ఇంచుమించు మూడు వేలమంది దానిని విశ్వసించిరి, తమ పాపముల విషయమై మారు మనస్సు బొందిరి, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. మరియు వారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొనెను. మనము ఎఫెసీ 5:23-25 ను, కొలస్స 1:18 ని చదివినయెడల క్రీస్తు సంఘమును ప్రేమించెనని దాని కొరకు చనిపోయెనని దాని రక్షకుడని, శిరస్సని మనకు తెలియజేయబడింది. ఎఫెసీ 4:4-6 లో ఒకే ఒక్క శరీరమున్నదని పౌలు చెప్పెను. మరల ఎఫెసీ 1:22, 23 లో సంఘము ఆయన శరీరమని, దానికి ఆయనే శిరస్సని అతడు చెప్పెను.

ప్రభువు సంఘము ఒకే ఒక్కటి యున్నదని చదువుట మాత్రమే గాక, విభజనలు ఖండింపబడినవని మనకు తెలియజెప్పబడినది. కొరింథులోని సంఘము విభజింపబడి యున్నదని వినగానే పౌలు వారికి ఇట్లు వ్రాసెను: "సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువై

యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (I కొరింథీ 1:10). అపొస్తలుల ఐక్యతకొరకు, వారి వాక్యముద్వారా విశ్వాసులైన వారందరి ఐక్యతకొరకు క్రీస్తు ప్రార్థించెను. ఈ విశ్వాసులే సంఘమై యున్నారు. ఆయన ఇట్లు ప్రార్థించెను: "మరియు నీవు నన్ను పంపితి వని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను. మనము ఏకమై యున్నలాగున వారును ఏకమై యుండవలెనని నీవు నాకు అనుగ్రహించిన మహిమను నేను వారికి ఇచ్చితిని. వారియందు నేనును నాయందు నీవును ఉండుటవలన వారు సంపూర్ణులుగా చేయబడి యేకముగా ఉన్నందున నీవు నన్ను పంపితివనియు నీవు నన్ను ప్రేమించినట్టే వారినికూడ ప్రేమించితి వనియు లోకము తెలిసికొనునట్లు నాకు అనుగ్రహించిన మహిమను వారికి ఇచ్చితిని" (యోహాను 17:20-23).

దీనియంతటిని బట్టి చెప్పేదేమంటే క్రీస్తు సంఘము ఒక డినామినేషన్ కాదు. ఏ డినామినేషనయినా పరిపూర్ణమైనది కాదు. అది పూర్ణంలోని ఒక భాగము. అది విభజనను సూచించుచున్నది. మానవుడు క్రీస్తు బోధకు లోబడుటకు నిరాకరించుటవలన కలిగినదది. క్రైస్తవులుగా మాత్రమే యుండుటకు, క్రీస్తు సంఘ సభ్యులుగా యుండుటకు నిరాకరించుటవలన కలిగినదది. అట్టి విభజన దేవునిచే ఖండింపబడినది. అది అట్లుంటే, బైబిలులో మనం చదివే సంఘము దానికదే పరిపూర్ణమైనది. అది లోకమందంతటా యున్నది. ప్రతి స్థానిక సంఘము అనేక సభ్యులతో ఎట్లు సమకూడి యున్నదో అట్లే అది అనేక స్థానిక సంఘములతో కూడియున్నది. కాని అది ఒకే ఒక్క సంఘము. ఏలయనగా అది క్రీస్తుది. దాన్ని ఆయనే కట్టెను. దాని కొరకు ఆయనే చనిపోయెను. ఆయనే దాని రక్షకుడు, దాని శిరస్సు. దాని సభ్యులు 'క్రైస్తవుడు' అనే పేరును ధరింతురు. సంఘముగా అది

క్రీస్తు సంఘమని పిలువబడింది. అది బైబిలును మాత్రమే వెంబడించును. ప్రభువు బోధప్రకారము అది దేవుని నారాధించును, దాని పనిని జరిగించును.

క్రీస్తును అనుసరించు చున్నామనుకొనే వారిలో పెక్కుమంది డినామినేషన్ సంఘాలకు చెందినవారే. ఈ సంఘాలు క్రీస్తుకు చెందవు. అంటే వాటి సభ్యులు క్రీస్తుకు చెందరు. వ్యక్తిగతంగా గాని డినామినేషన్ సంఘములుగా గాని వారు క్రీస్తు నామమును ధరించరు. వారు డినామినేషన్లని అంతకంటే ఎక్కువేమీ కాదని వారంగీకరింతురు. డినామినేషన్లన్నియు కలసి క్రీస్తుసంఘముగునని వారు చెప్పుకొనుచుందురు. గాని అట్టిదేమీ బైబిలులో బోధింపబడలేదు. డినామినేషన్ ప్రజలవలె, డినామినేషన్ సంఘాలవలె, వారి ఆరాధన, కృషి, నమ్మకలు, ఆచారములు, నిజానికి వారు చేసేదంతయు బైబిలు బోధించుదానికి వ్యతిరేకముగా యున్నది. అందువలన వారు ప్రభువుకు అంగీకృతులుకారు.

డినామినేషన్లకు విముఖముగా యున్నందున కొందరు క్రీస్తు సంఘమును ద్వేషింతురు. డినామినేషన్ సంఘ సభ్యులమని వారంగీకరించుచున్నందున, అంటే వారు క్రీస్తుసంఘము కాదని అంగీకరించుచున్నందున, సంఘమును వారిస్థాయికి తీసికొని వచ్చుటకు వారు ప్రయత్నింతురు. వారు క్రీస్తు సంఘాన్ని కించపరుతురు, దానిలో తప్పులెన్నుదురు, ఎన్నెన్నో సాకులు చెప్పుదురు. అయితే క్రీస్తు సంఘాన్ని గూర్చి మానవుడేమి చెప్పుకొన్నను పరవాలేదు. గాని దాన్ని గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నది? అనేది ఇప్పుడు ప్రశ్న. అయితే అది బైబిలులో యున్నది, లేదా బైబిలులోలేదు. అయితే అది క్రీస్తు సంఘము, లేదా అది క్రీస్తు సంఘముకాదు. మనం ఆ ఒకే సంఘ సభ్యులమైనా అవ్వాలి, లేదా దానిలో సభ్యులముకాము.

మీరు బైబిలును తెరచి అది ప్రభువు సంఘమును గూర్చి

యేమి చెప్పుచున్నాదో చదివి, ధ్యానించి, పరిశోధించ వలెనని మిమ్మును ఆహ్వానించుచున్నాము. మీరు సత్యము నంగీకరించి, ప్రభువుకు లోబడాలని, సంఘముతో ఆయనచే చేర్చబడాలని మిమ్మును ప్రోత్సహించ గోరుచున్నాము. అప్పుడే మీరు క్రీస్తు సంఘసభ్యులగుదురు. నేటి ప్రపంచములో ప్రతివాడు ఆ సంఘ సభ్యుడగుటకు కోరుకోనాలి. ఇంకోటి దేనికో చెందుచు ఎవరైనా ప్రభువును ఎట్లు సంతోషపరచ గోరుదురు? నీవు క్రైస్తవుడవు క్రీస్తు సంఘసభ్యుడవు కానియెడల నీవు క్రీస్తులోనికి ప్రవేశింతువని ప్రార్థించు చున్నాము. అప్పుడు మాత్రమే ప్రభువు మహిమపరచ బడును.

---

## క్రీస్తు పునరుత్థానము - 2

### *(The Resurrection of Christ)*

### శత్రువులు యేసు శరీరమును ఎత్తికొనిపోయిరా?

క్రైస్తవ్యమునకు యేసుక్రీస్తుయొక్క పునరుత్థానము అతి ప్రాముఖ్యమైనది. నిజానికి క్రైస్తవ్యమంతయును క్రీస్తు పునరుత్థానము మీదనే ఆధారపడియున్నది. క్రీస్తు చనిపోయిన తరువాత ఆయన శరీరమును సమాధిలో యుంచగా మూడవదినమున అది మాయమాయెను. అది అట్లగుటకు కనీసము మూడింటిలో ఏదో ఒకటి జరిగియుండ వచ్చును: అవి, క్రీస్తు శత్రువులు ఆయన దేహమును ఎత్తుకొని పోయిరి, లేదా క్రీస్తు శిష్యులు దాని నెత్తుకొనిపోయిరి, లేదా ఆయన సజీవుడై లేచెను. జరుగుటకు అవకాశమున్న ఈ మూడు సందర్భములలో ఒక్కొక్క దానిని ఇప్పుడు పరిశీలించుదము.

క్రీస్తు సమాధి చేయబడిన మూడవ దినమున ఆయన శరీరము సమాధిలో లేకుండ పోయెను. అయితే ఆయన శత్రువులు ఆయన శరీరమును తీసికొని పోయిరా? ఈ ప్రశ్నకు 'అవును' అని జవాబు

ఇచ్చువారు అనేక అసాధ్యముల నెదుర్కొన వలసి వచ్చును. అట్టివారు క్రీస్తు శరీరమును తీసి కొనిపోవుటలో యూదులకు గల అభిప్రాయమును తెలియజెప్పుట దుస్సాధ్యమైనది. ఏమయినను సరే ఆయన శరీరము సమాధిలోనే యుండవలెనని వారు తలంచిరి. క్రీస్తు తగిన రీతిగా చంపబడెనని వారు నమ్మిరి. అంతేకాదు, సమాధి చేయబడిన తరువాత పునరుత్థానమును గూర్చి క్రీస్తు చెప్పిన మాటలను వారు జ్ఞప్తికి తెచ్చుకొని వారు ప్రభుత్వ అధిపతియైన పిలాతు నొద్దకు వచ్చి "అయ్యా, ఆ వంచకుడు సజీవుడై యున్నప్పుడు, మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినము వరకు సమాధిని భద్రము చేయ నాజ్ఞాపింపుము" అని వేడుకొనిరి (మత్తయి 27:62, 63). "అందుకు పిలాతు-కావలి వారున్నారుగదా, మీరు వెళ్లి మీ చేతనైనంత మట్టుకు సమాధిని భద్రము చేయుడని వారితో చెప్పెను. వారు వెళ్లి కావలి వారిని కూడ ఉంచుకొని, రాతికి ముద్రవేసి సమాధిని భద్రము చేసిరి" (మత్త 27:65, 66). దీనినిబట్టి ఎట్టి సందర్భములోనైనను క్రీస్తు యొక్క మృతదేహము సమాధిలోనే యుండవలెనని వారు ఏర్పాటు చేసిన తరువాత అదే దేహమును వారు దొంగిలించుటలో గల ఉద్దేశ్యమేమిటో మనము చెప్పుకొనలేము. ఎవరును ఆ శరీరమును ఎత్తుకొని పోకుండుటకే వారు ప్రయత్నించిరి.

## నాలుగు విధములుగ మరణశిక్ష

క్రీస్తు శత్రువులకు వెనుక ఏదో ఒక అభిప్రాయమున్నదనియు, అందుచే వారు ఆ శరీరమును ఎత్తుకొని పోయిరనియు మనము అంగీకరించినను ఆ కార్యమును వారెట్లు సాధించిరో ఊహించుట అసాధ్యము. ఒకవేళ వారు దానిని సాధించగలిగి యుంటే రోమా దేశ చట్ట ప్రకారము అట్టి క్రియననుసరించి నాలుగు విధములుగ మరణశిక్ష విధించబడవలెను. క్రీస్తుయొక్క సమాధి రోమా ప్రభుత్వ ముద్రతో మూయబడినది.

చట్టప్రకారము ఆ ముద్రను భంగపరచువానికి మరణశిక్ష విధించబడ వలెను. ఆ ముద్రను చెఱచుట కవకాశమిచ్చిన కావలివారికి చట్ట ప్రకారము మరణశిక్ష విధింపబడవలెను. ముద్ర వేయబడిన సమాధి లోని శరీరమును దొంగిలించువారు మరణశిక్షకు పాత్రులు. అట్టి శరీ రమును దొంగిలించుట కవకాశమిచ్చిన కావలివారు కూడ మరణ శిక్షకు పాత్రులు. ఇన్ని విధములుగ మరణదండన విధింపబడుటకు అవకాశమున్నపుడు ఎవనికినీ అట్టి శిక్ష విధింపబడలేదు. ఏలయనగా యేసు శత్రువులలో యెవడును ఆయన శరీరమును దొంగిలించి యుండలేదు.

పెంతెకొస్తు అను పండుగ దినమున పేతురు మిగిలిన 11 మంది అపొస్తలులతో కలసి, యేసును సిలువ వేసిన వేలకొలది ప్రజల మధ్య నిలబడి, మీరు దుష్టులచేత ఆయనను సిలువ వేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించుట అసాధ్యము గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను. ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము అని నిర్భయముగా బోధించెను. ఒక వేళ శత్రువు లెవరయినను క్రీస్తు శరీరమును దొంగిలించిన యెడల ఈ ప్రత్యేక సమయమందు వారు దాని నెందుకు బయలు పరచలేదు? ఎత్తుకొనిపోయిన దేహమును వారు ప్రజలందరియెదుట బహిరంగముగా సమర్పించుటచే అపొస్తలుల నందరినీ అబద్ధికులనుగా చేసే అవకాశము వారికున్నను దానిని వారు వినియోగించుకొన లేకపోయిరి. అంటే దానికి ఒకే ఒక్క సమాధానము ఉన్నది. వారు క్రీస్తు శరీరమును ఎత్తుకొని పోలేదు.

## పెంతెకొస్తునాడు వారి వింత ప్రవర్తన

అంతేకాదు, ఆనాటి వారి ప్రవర్తన మరింత ఆశ్చర్యముగా మనకు కనబడుచున్నది. యెరూషలేములో పెంతెకొస్తు పండుగనాడు కూడివచ్చిన వేలకొలది ప్రజలకు పేతురు, క్రీస్తుయొక్క జీవితమును,

మరణమును ఒక్కసారి ఈరీతిగ జ్ఞాపకము చేసెను. "ఇశ్రాయేలు వారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతములను, మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్య చేయించి ఆయనను తనవలన మెప్పు పొందినవానిగా మీకు కనబరచెను; ఇది మీరే యెరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును, ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము. గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను. మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను" (అపో. కా. 2:22-24; 37). క్రీస్తు మృతులలోనుండి లేచెనని పేతురు ధైర్యముతో ప్రకటింపగా యీ యూదులు దానిని నిరాకరించుట మాని అది యథార్థమని అంగీకరించిరి. వారు పేతురు చేసిన గొప్ప ప్రబోధమును విని, దైవజనుడైన క్రీస్తు మరణములో అపరాధులమని గ్రహించి, పేతురును, కడమ అపొస్తలులను ఒక ప్రశ్నను అడిగిరి - అయ్యా, మేమేమి చేయవలెను? రక్షణ పొందుటకు మేమేమి చేయవలెను? అని వారు అడుగగా "పేతురు - మీరు మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని వారికి జవాబిచ్చెను. అంతట వారు క్రీస్తు పునరుత్థానమును గూర్చి వ్యాజ్య మాడలేదుగాని, పేతురు చెప్పిన రీతిగ క్రీస్తు నామమున మూడువేలమంది బాప్తిస్మము పొందిరి. కొన్ని దినముల క్రితమే క్రీస్తును సిలువ వేయుము, సిలువ వేయుము అని అరచిన ఈ ప్రజలు క్రీస్తు నిజముగా తిరిగి లేచెనని నమ్ముట మాత్రమే గాక, ఆయనలో లీనమగుట ఆశ్చర్యముకాదా! పెంతెకొస్తునాటి వారి ప్రవర్తనే

చెప్పుచున్నది – వారు ఆయన శరీరమును సమాధి నుండి ఎత్తుకొని పోలేదని. క్రీస్తు శత్రువులు ఎవరును, ఎప్పుడును మేము ఆయన శరీరమును ఎత్తుకొని పోతిమి అని ఆరోపించలేదు. అట్టి దేదయినను జరిగితే క్రీస్తు శిష్యులే ఆపనిని చేసి యుందురని వారారోపించిరి గాని, వారు మాత్రము ఆ పనిని చేసినట్లు ఎన్నడు ఆరోపించలేదు.

అంతేకాదు క్రీస్తు శిష్యులు ఆయన శత్రువులు ఆయన శరీరమును ఎత్తుకొని పోయిరనికూడ ఎన్నడు నిందించలేదు; సరిగదా క్రీస్తు లేచినప్పుడు మహా భూకంపము కలిగెను. కావలివారు భయపడి వణకి చచ్చిన వారివలె నుండిరి యని శిష్యులు చెప్పిరిగాని శత్రువులపై వారు ఎన్నడును నిందారోపణ చేయలేదు.

సమాధిదగ్గర "కావలి యున్న వారిలో కొందరు పట్టణములోనికి వచ్చి జరిగిన సంగతులను అన్నిటిని ప్రధాన యాజకులతో చెప్పిరి. కాబట్టి వారు పెద్దలతో కూడి వచ్చి ఆలోచనచేసి ఆ సైనికులకు చాల ద్రవ్య మిచ్చి మేము నిద్రపోవుచుండగా అతని (క్రీస్తు) శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తుకొని పోయిరని మీరు చెప్పుడి. ఇది అధిపతి చెవిని బడినయెడల మేమతని సమ్మతి పరచి మీ కేమియు తొందర కలుగకుండ చేతుమని చెప్పిరి" (మత్త. 28:11-14).

ఇప్పటివరకు మనము చేసిన పరిశోధనలను బట్టి సమాధిలో యున్న క్రీస్తు శరీరమును ఎత్తుకొని పోవుటలో కలిగే ప్రయోజనము ఏమియు లేనందున, అట్టి అభిప్రాయము వారికి లేనందున శత్రువులు ఆయన శరీరమును ఎత్తుకొనిపోయి యుండలేదని మనకు నిర్ధారణ యగుచున్నది. అంతేకాదు, అట్టి క్రియలో ఇమిడి యున్న మరణ శిక్షల మూలముగను, నిరాకరించుటకు పెంతెకొస్తు దినమున అవకాశము దొరుకగా క్రీస్తు శత్రువు లెవరు ఆయన పునరుత్థానమును నిరాకరించకపోవుటయే గాక, అంగీకరించినందునను క్రీస్తు శత్రువు లెవరు ఆయన శరీరమును సమాధినుండి ఎత్తుకొని పోలేదని మనకు మరింత

దృఢముగ నిర్ధారణ యగుచున్నది. వచ్చే సంచికలో క్రీస్తు శిష్యులు ఆయన శరీరమును సమాధినుండి ఎత్తుకొని పోయిరా? అనే ప్రశ్నను పరిశోధింతము.

ఈలోగా పునరుత్థానుడైన క్రీస్తునందు విశ్వాస ముంచుటయే గాక ఆయన సువార్తకు మీరు విధేయులగుట అత్యంత ప్రాముఖ్యమని మీరు గమనించ గోర్తాను.

—జాషువా గూటం.

---

## విశ్వాసము ద్వారా ఒకడు రక్షింపబడును

"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6). ఒక మానవుడు పాపక్షమాపణ పొందుటకు మొట్ట మొదట దేవుని విశ్వసించవలెను. క్రొత్త నిబంధన అంతయు ఈ విషయమును గూర్చి ఖచ్చితముగా బోధించుచున్నది. అపో. కా. 16 : 31 నందు పౌలు సీలలు, చెరసాల నాయకునికి చెప్పిన మొట్టమొదటి విషయ మేమనగా "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము. అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు". కాబట్టి విశ్వాసము ద్వారా ఒకడు రక్షింపబడగలడు.

కాని విశ్వాసము మాత్రమే ఒకనిని రక్షింపజాలదు. వారు బాంబులతో యుద్ధము చేసిరి. వారు బాంబులతో మాత్రమే యుద్ధము చేసిరి. ఈ రెండు వాక్యములు ఒకే విషయమును చెప్పుటలేదు. వేరు వేరు అంశములనుగూర్చి యివి తెలియజేయుచున్నవి. 'విశ్వాసము', 'విశ్వాసము మాత్రమే' అను ఈ రెండు మాటలు ఒకే అర్థమును కలిగియుండలేదు. "ప్రాణములేని శరీర మేలాగు మృతమో, అలాగే క్రియలులేని విశ్వాసము మృతము" (యాకో. 2:26). "దయ్యములు నమ్మి వణకుచున్నవి" (యాకో. 2 : 19). విశ్వాసము మాత్రమే

రక్షించునని నీవు నమ్ముచున్న యెడల నీ విశ్వాసము మృతమైనదే, మరియు అది దయ్యముల విశ్వాసముతో సమానమే. విధేయతతో కూడిన విశ్వాసము మిక్కిలి అవసరము. మన విశ్వాసము మరణ పర్యంతము ఉండవలెనని ప్రభువు చెప్పుచున్నాడు (ప్రక 2:10).

"నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16), నమ్మకము, బాప్తిస్మము ఈ రెండు మాటలను విడదీసి లేదా ఒకదానిని తొలగించి బోధించిన మానవులుగాని పరలోకము నుండి దిగి వచ్చిన దేవదూతలుగాని లేదా అపొస్తలులే తిరిగి వచ్చి బోధించిన గాని వారు శాపగ్రస్తులు (గలతి 1:8).

ఈనాడు మానవులు నమ్మి బాప్తిస్మము పొందనివాడు రక్షింపబడునని బోధించుచున్నారు. రక్షింపబడినవారు బాప్తిస్మము పొందిరని కొందరు తమ పత్రికలలో సహితము ప్రచురించుచున్నారు. యిట్టి దుర్బోధకులను గూర్చి అపొస్తలులు ముందుగానే చెప్పిరి. "వాక్యమును ప్రకటింపుము...... ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురదచెవులు గలవారై, తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసికొని, సత్యమునకు చెవి ఇయ్యక కల్పనాకథలవైపు తిరుగు కాలము వచ్చును" (II తిమో 4:1-4).

రక్షణకొరకు మానవుడు దేవుని ఆజ్ఞలకు విధేయుడు కావలెను. యేసు "తనకు విధేయులైన వారికందరికి నిత్య రక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:10). మానవుడు ఆజ్ఞలన్నియు గైకొనవలెనని దేవుడు కోరుచున్నాడు. బాప్తిస్మము ఆజ్ఞాపింపబడెను. కొందరు మత శాఖలవారు బాప్తిస్మము ఒక ఆచారమని లేక సంస్కారమని అనుచున్నారు. కొందరు, రక్షణ పొందుటకు బాప్తిస్మము అవసరము లేదని బోధింతురు. నీవు ఈ దుర్బోధలను నమ్ముచున్నట్లయితే గ్రంథమును జాగ్రత్తగా పఠించి సత్యమును తెలిసికొనవలసిన అవసరము ఉన్నది.

ఈ వచన భాగములను పరిశీలించుము :

మానవుడు రక్షింపబడుట కొఱకు

1. విశ్వసించవలెను - యోహా 3 : 16; హెబ్రీ 11 : 6; మార్కు 16 : 16; అ.కా. 16 : 31.
2. మారు మనస్సు పొందవలెను - అ.కా. 2 : 38; లూకా. 13 : 3, అ.కా. 17 : 30.
3. యేసు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొనవలెను - మత్త. 10 : 32; రోమా 10 : 9.
4. బాప్తిస్మము పొందవలెను - మత్త 28:19-20; మార్కు 16:16; అ.కా. 2:33; 1 పేతు 3:21; గలతి 3:27; అ.కా. 22:16.

మరణము వరకు నమ్మకముగా నుండివారికి యేసు ప్రభువు జీవకిరీటమును వాగ్దానము చేసెను (ప్రక 2:10). నీ విశ్వాసమును క్రియారూపముగ కనపరచుము. అప్పుడు ప్రభువు నిన్ను తన సంఘముతో చేర్చును. విశ్వాసము మాత్రమే చాలునని నీవు తలంచినచో ప్రమాదము సుమా !

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## తీర్పులో నీగతి ఎట్లుంటాది?

*( How will you fare in the Judgment ? )*

బైబిలు ఇట్లనుచున్నది: "వారు నీతి మార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞ నుండి తొలగి పోవుటకంటె ఆ మార్గము అనుభవ పూర్వకముగా తెలియకయుండుటయే వారికి మేలు" (2 పేతురు 2:21).

ఒకడు సత్యమును తెలిసికొని దాని నుండి తొలగిపోతే అది నిజంగా చాల ప్రమాదకరము. సత్యమును తెలిసికొని దాని నుండి తొలగిపోవుటకంటే సత్యాన్ని తెలిసికొన కుండుటయే మేలని అపొ.

పేతురు చెప్పుచున్నాడు. బైబిలు ఇట్లనుచున్నది: "మనము సత్యమును గూర్చి అనుభవజ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా పాపము చేసినయెడల పాపములకు బలి యికను ఉండదుగాని న్యాయపు తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండదు. ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించిన యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద కనికరింపకుండ వాని చంపించుచుందురు. ఇట్లుండగా దేవుని కుమారుని పాదములతో త్రొక్కి, తాను పరిశుద్ధ పరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి, కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును?" (హెబ్రీ 10:26-29).

తప్పిపోయిన వానికి క్షమాపణ ఉండదని బైబిలు బోధించుట లేదు గాని క్రీస్తు బలితప్ప వేరొక బలిలేదని బోధించుచున్నది. క్రీస్తు ఒక్కడే మన పాప ప్రాయశ్చిత్త బలియై యున్నాడు. ఆయనది తప్ప వేరొకటిలేదు.

లూకా 12 లో, ప్రభువు చిత్తము నెరిగియుండియు సిద్ధపడక యున్న దాసునికి అనేకమైన దెబ్బలు తగులునని చెప్పబడినది. అయితే తన యజమాని చిత్తము నెరుగనివానికి కొద్ది దెబ్బలే తగులునని చెప్పబడినది (లూకా 12:47, 48).

తీర్పులో మిగతావారికంటె కొందరిగతి బాగుంటాదని యేసు బోధించెను. ఆయన ఇట్లనెను: "అయ్యో కొరాజీనా, అయ్యో బేత్సయిదా, మీమధ్యను చేయబడిన అద్భుతములు తూరు సీదోను పట్టణములలో చేయబడిన యెడల ఆ పట్టణములవారు పూర్వమే గోనెపట్ట కట్టుకొని బూడిదవేసికొని మారుమనస్సు పొంది యుందురు. విమర్శదినమందు మీగతికంటె తూరు సీదోను పట్టణములవారి గతి ఓర్వదగినదై యుండునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 11:21, 22).

తప్పిగవ: లో యున్న సంఘసభ్యుడా, తీర్పులో నీగతి ఎట్లుంటాది? ఆయన నిన్ను త్రాసులో తూచగా వెల్లసరువలె తక్కువగా కనబడుదువా? (దాని 5:27).

—రిచర్డ్ బోనర్.

---

## అధికారయుక్తమైన దైవ వాక్కు - 3

—T. జ్ఞానానందము, కాకినాడ.

(గత సంచిక తరువాయి)

దేవుడు ప్రవక్తల ద్వార మాటలాడినాడు; కుమారుని ద్వార మాటలాడినాడు. యేసు తండ్రి మాటలను శిష్యులకిచ్చినాడు. వారు పరిశుద్ధాత్మ పూర్ణులై నూతన నిబంధన గ్రంధమును వ్రాసి సంపూర్తి చేసిరి. దేవుడు మనకిచ్చిన బైబిలు యిదియే. అది పరిశుద్ధ గ్రంథము, సంపూర్ణ గ్రంధము.

దేవుడు ఈ దినములలో, లోకముతో ఈ గ్రంధము ద్వారానే మాట్లాడును. వేరు ప్రత్యక్షత లేదు, కనుక ఏవరైనను దర్శనములు పొందుట ద్వారా దేవుడు నాతో మాట్లాడినాడని చెప్పినను, బైబిలులో చూపబడిన రక్షణ మార్గము గాక, వేరురీతిగా రక్షణ పొందవచ్చునని పలికినను మా సంఘమునకు ఫలానా పేరు పెట్టమని దర్శనములో ప్రభువు చూపించినాడని పలికినను, కేవలము పొరబాటని మనము గ్రహించవలెను. మతశాఖలకు చెందిన వివిధ భిన్న విశ్వాస ప్రమాణములకు బైబిలులో తావులేదు (II తి. 3 : 16; II పేతురు 1 : 3; ఎఫె 1 : 3).

దేవుని వాక్యము మన అవసరములకు సరిపోవునదని మనము చూచితిమి. అయినను దానిని విడిచి మనము వేర్వేరు మార్గములకు పోవుటచే క్రైస్తవ సంఘము అనేక చీలికలైనది. బైబిలు గొప్ప

ఐక్యతగల గ్రంథము. దానిని వెంబడించుటలోనే మనము ఐక్యత నొందగలము.

అందు ఏడు గొప్ప ఐక్యతలు గలవు.

1. ఒక్కడే దేవుడు, 2. ఒక్కడే ప్రభువు (యేసుక్రీస్తు), 3. ఒక్కడే ఆత్మ (పరిశుద్ధాత్మ), 4. ఒక్కటే నిరీక్షణ (అది పరలోకమే), 5. ఒక్కటే విశ్వాసము, 6. ఒక్కటే బాప్తిస్మము, 7. ఒక్కటే శరీరము (సంఘము) (ఎఫె 4:4-6).

మొదటి నాల్గింటిలోను క్రైస్తవ లోకమునకు ఏకత్వము గలదు. మిగత మూడింటిలో ఏకత్వము లేదు.

ఒకే విశ్వాసము లేదు - రక్షణ పొందుటెట్లు? సంఘారాధన ఎట్లు? సంఘ పాలన ఎట్లు? అను విషయములలో అందరి విశ్వాస మొకటికాదు, కనుక ఒకే విశ్వాస ముండవలయునన్న, అందరము బైబిలు నొద్దకు తిరిగి రావలయును.

ఒకే బాప్తిస్మము లేదు - చాలమంది క్రైస్తవులకు బాప్తిస్మ మక్కర లేదు. అది అవసరమని తలంచువారు కూడ ఒకే తీరున దాని జరిగించుట లేదు. మరియు బాప్తిస్మ మెందుకు అను ప్రశ్నకు బైబిలును విడిచి వేరు భావములు వెలిబుచ్చుచున్నారు. మరికొందరు ఆత్మ బాప్తిస్మము చాలు, నీటి బాప్తిస్మ మక్కరలేదందురు ఆత్మ బాప్తిస్మ మనునది చరిత్రలో రెండుసార్లు మాత్రము జరిగినది (అపొ. కా. 2:1-4; 10:44-48). ఇక ఎన్నటికిని అదిలేదు. కనుక మన మొకే బాప్తిస్మముండవలెనన్న బైబిలు చెప్పునదేదో చేయవలయును.

క్రీస్తుప్రభు వొకేసంఘమును స్థాపించెను, గాని ఈ దినములలో మతశాఖలు, మిషనులు, గూ్రపులు వందలకొలది నున్నవి. రక్షణ విషయములో, బాప్తిస్మము విషయములో సంఘ పాలనా విషయములో, ఆరాధన విషయములో అన్నియు అన్ని రకములుగ నున్నవి. మరియు మన సేవ పోటీలకును, వైషమ్యములకును దారితీసినది. దక్షిణ

ఇండియాలో సంఘ ఐక్యతకొరకు ప్రయత్నములు జరుగుచున్నవి. అది వాక్యానుసారమైనచో మనకు జయమును, దేవునికి మహిమయు కలుగును. వీనినుండి బయటపడవలెనన్న, బైబిలు నొద్దకు తిరిగి రావలయును. అది ఒకే మార్గమును జూపును.

## బైబిలు చదువుటలో గుర్తింపదగు విషయములు

'సత్య వాక్యమును సరిగా విభజించుము' అని పౌలు తిమొతియను హెచ్చరించెను (2 తిమొ 2 : 15). వ్రాయబడినది ఎవరు చెప్పిరి ? ఎవరికి చెప్పిరి ? ఎందుకు చెప్పిరి ? ఏ కాలములో ఏ సందర్భమున చెప్పిరి ? అను ప్రశ్నలు వేసికొని చదివినచో బైబిలు మనకు బాగుగా అర్థమగును మరియు మనము పొరబాటు చేయలేము.

బైబిలంతయు మనకొరకే వ్రాయబడినను అందులో ఏదో మూలనున్న ఏదో యొక భాగముతీసి, దాని సందర్భమునుండి విడదీసి, ఆలాగే మనమును చేయవలెననుట పొరబాటు. అది దైవగ్రంథమును దుర్వినియోగము చేయుటగును. ఇంకను కొన్ని వివరముగ చూతము.

బైబిలు కాలమును మూడు యుగములుగ పండితులు విభాగించిరి. 1. పితరుల యుగము - ఆదాము మొదలు మోషేవరకు సుమారు 2,500 సంవత్సరములు. 2. ధర్మశాస్త్ర యుగము - మోషే మొదలు క్రీస్తు ప్రభువు సిలువ వరకును సుమారు 1500 సంవత్సరములు. 3. క్రైస్తవ యుగము - పునరుత్థానుడైన క్రీస్తు మొదలు నేటివరకును, మరి లోకాంతము వరకును. పితరుల కాలములో దేవుడు పితరులతోనే మాట్లాడినాడు. ఆదాము, నోవహు, అబ్రహాము, ఇస్సాకు మొదలైన వారు. వీరు కుటుంబ యజమానులు. దేవుని గూర్చిన జ్ఞానము వారికి కొంతవరకే బైలుపడినది. రెండవ కాలములో అనగా ధర్మశాస్త్ర కాలములో దేవుడొక జనాంగమును ఏర్పరుచుకొని ఆ జనాంగమునకు గొప్ప తర్బియతు నిచ్చినాడు. అనేకమైన ఆజ్ఞలు, బలి యర్పణములను గూర్చిన విధులు వారి కివ్వబడినవి. మూడవ కాలములో అనగా

క్రైస్తవ యుగములో దేవుడు యేసుక్రీస్తుద్వారా లోక మంతటితో మాట్లాడుచున్నాడు. మొదటి కాలముయొక్క దైవప్రత్యక్షత నక్షత్రముల కాంతికిని, రెండవ కాలముయొక్క ప్రత్యక్షత చంద్రుని కాంతికిని, మూడవ కాలముయొక్క ప్రత్యక్షత సూర్యకాంతికిని పోల్చబడినది. దేవుడీదినములలో ఏమి చెప్పవలసి యున్నను క్రీస్తు ద్వారానే మనతో మాట్లాడును. అదియే నూతన నిబంధన.

సిలువకు ముందుగల రెండు యుగములలో రక్షణ మార్గము, ఆరాధనా విధానములకొరకై వెదకుటచే క్రైస్తవ మత ప్రపంచము అనేక తప్పు సిద్ధాంతములకు దారితీసినది. కనుక చెప్పబడినది ఎవరితో, ఏ కాలమందు, ఏ సందర్భమున అని విభజించి బైబిలును చదువ వలయును.

మరియు బైబిలు స్పష్టముగా చెప్పినది చేయకపోవుట, చెప్పనిది ఊహించి "ఈలాగు చేసిన పరవలేదు" అనుకొని చేయుట అనేక కీడులకు దారితీసినది.

క్రైస్తవులమైన మనము ఆశీర్వదింపబడు లాగున బైబిలు గ్రంథము మనకు దొరికినది. దానికి కర్తయైన పరిశుద్ధాత్ముడు ఎల్ల వేళల మనయొద్ద నున్నాడు. ఆయన సహాయమున మనము దానిని చదివి, ఆశీర్వాదము నొందుదము గాక. (సమాప్తం)

---

సంక్షిప్త ప్రసంగము :

## "నీ చేతిలో ఉన్నదేమిటి?"

## *(What is that in Thy Hand ?)*

నిర్గమ 4 అధ్యా

పరిచయము :

A. మోషే 80 సంవత్సరాలు వయస్సువాడయ్యేసరికి జీవితంలో సాధించింది ఏమీ లేదు. అతడు నోటిమాంద్యము గలవాడు,

ఆత్మ ధైర్యము లేనివాడు. నాయకుని లక్షణాలేమీ అతనిలో అప్పటికి కనబడ లేదు.

**B.** కాని అతడు దేవుని కర్పించుకొన్నప్పుడు, దేవునిచే నడిపింప బడినప్పుడు దేవుని ప్రజల చరిత్రలో అతడు చాల ఘను డయ్యాడు.

**C.** ఇది ఆశ్చర్యము కాదు - దేవుడు స్వల్పమైన వాటినుండి ఘన మైన వాటిని సాధించగలడు.

ఒక చిన్న ప్రశ్న :

**A.** "నీ చేతిలో ఉన్న దేమిటి ?" ఒక కర్ర యని మోషే జవా బిచ్చాడు.

**B.** మోషే చేతిలో యున్నది ఒక సామాన్య కర్రయే అయినను దేవుని మహాశక్తివలన ఐగుప్తుమీదికి తెగుళ్ళు రప్పించుటకు, ఎర్ర సముద్రమును విడదీయుటకు, ఒక బండలోనుండి నీళ్ళు రప్పించుటకు, యుద్ధము జయించుటకు ఒక సాధనమాయెను.

**C.** స్వల్పమైనవి దేవుని చేతిలో యుంచబడినప్పుడు అవి ఘనమై నవిగా తయారగును.

దావీదూ, నీ చేతిలో యున్న దేమిటి ?

**A.** ఒక వడిసెల, ఐదు నున్నని రాళ్ళు. వీటితో అతడు గొల్యాతు అను ఫిలిష్తీయుల శూరునిమీదికి వెళ్ళెను.

**B.** నీవు చిన్న వాడవే, పోయి గొర్రెలు మేపుకొంటే మేలు అని అతని సహోదరులు అతని మందలించిరి.

**C.** వడిసెల చేతబట్టుకొనిన ఈ చేయి ఒకానొక రోజు రాజదండ మును చేతబట్టుకొనునని వారెరుగకపోయిరి.

**D.** దావీదు ఆ ఫిలిష్తీయునితో "సైన్యముల కధిపతి యగు యెహోవా పేరట నేను నీ మీదికి వచ్చుచున్నాను" అని

చెప్పెను. దావీదు చేతిలో యున్న చిన్న వడిసెలను, చిన్న రాళ్ళను బహు శక్తివంతముగా చేసినది యెహోవాయే (1 సమూయేలు 17:38-54).

## చిన్నవాడా, నీ చేతిలో యున్నదేమిటి ?

ఐదు రొట్టెలు, రెండు చేపలు. గాని అవి యేసుప్రభువు చేతిలో నుంచబడినప్పుడు ఐదువేల మందికి ఆహారమాయెను (మత్తయి 14: 16-21).

## దొర్కా, నీ చేతిలో యున్నదేమిటి ?

**A.** ఒక సూది, దారము. అయితే అపొ.కా. 9:39 చదువు. అవును ఇవి స్వల్పమైనవే అయినను వాటిని ఆమె దేవుని మహిమకొరకు, సహోదరుల ఆదరణకొరకు వినియోగించెను.

**B.** విత్తనాలు గలిగిన రైతు, చిన్న దుకాణం కలిగిన వర్తకుడు, చిన్నవ్యాపారం కలిగిన వ్యాపారస్థుడు, చిన్నలు పెద్దలు వారికి కలిగినవాటిని ప్రభువు చేతిలో నుంచినయెడల వాటిద్వారా ప్రభువు గొప్ప కార్యములను సాధించగలడు.

## తలిదండ్రులారా, మీ చేతిలో యున్నదేమిటి ?

**A.** ఒక కొడుకో లేక కూతురో, అవును ఒక ఆత్మ దేవునిచే మీ కప్పగించబడింది. దాని నెట్లుపయోగించుచున్నారు ?

**B.** మీ మాదిరి సంగతి యేమిటి ? మీ మాదిరిద్వారా ప్రార్థించుట వారికి నేర్పుచున్నారా ? బైబిలు చదువుట ? సత్యమే పలుకుట ? సత్యానికి విధేయులగుట నేర్పారా ?

## బోధకుడా, నీ చేతిలో యున్నదేమిటి ?

**A.** ఒక బైబిలు.

**B.** అయితే 2 తిమో 4:1-5 లోను, 1 తిమో 4:16 లోను ఉన్న దాని హెచ్చరికల ననుసరించుచున్నావా ?

C. నీ చేతిలోనున్న బైబిలును సరిగ వినియోగించుచున్నావా?

పాపివైన మిత్రుడా, నీ చేతిలో యున్నదేమిటి ?

A. ఒక నిర్ణయము. క్రీస్తువుడు కావాలో వద్దో నీ విప్పుడు నిర్ణయించు చున్నావు.

B. దేవుడు నీ జీవితాన్ని తీసికొని దానినుండి ఆశ్చర్యకరమైన ఫలదాయకమైన పనులను చేయించగలడు.

C. మిత్రుడా నీ జీవితాన్ని ప్రభువు చేతికి ఈనాడే అప్పగింపుము.
యేసునందు విశ్వసించు. యోహాను 8:24.
పాపముల విషయమై మారుమనస్సు పొందు. లూకా 13:5.
యేసు ప్రభువని ఒప్పుకో. మత్తయి 10:32.
పాపక్షమాపణకొరకు బాప్తిస్మము పొందు. అపొ.కా. 2:38.

---

## కుల పద్ధతి సంగతి యేమిటి?

## *( What about the Caste System? )*

నేను భారతదేశం నుండి కెనడాకు తిరిగి వచ్చినప్పుడెల్లా, "భారతీయులు కులపద్ధతిని ఇంకా అనుసరించుచున్నారా?" యని అనేకులు నన్ను అడుగుదురు. అయితే నాకు తెలిసినంతమట్టుకు ప్రపంచములో అన్ని దేశాల్లోను కులపద్ధతియనే గాక వేర్వేరు పేర్లతో అది అనుసరించబడు చున్నదని నేను జవాబిత్తును.

క్రొత్త నిబంధనలో తన ప్రజలు దాని ననుసరింపరాదని దేవుడు కోరాడు. దానికి ఋజువుగా యేసు మాటలను మీకు సమర్పించు చున్నాను. "ఆత్మయే జీవింపచేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి". (యోహాను 6:63). పాత నిబంధన కాలంలో శరీరము ప్రయోజనకారి అయ్యింది. దేవుని బిడ్డ కావాలంటే ఒకడు శరీర

రీత్యా అబ్రిహాము సంతానమై యుండవలసి వచ్చింది. అయితే యేసు పై మాటలు చెప్పిన తరువాత ఆయన శిష్యులలో అనేకులు వెనుకతీసి మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేక పోవుటలో ఆశ్చర్యములేదు (యోహాను 6:66). పాకీపని చేసేవారితో తాను రొట్టె విరువలేనని ఇండియాలో ఒకాయన నాతో అన్నాడు. అతడు అగ్రకులానికి చెందినవాడు. అమెరికాలోను కెనడాలోను అటువంటి సందర్భములు ఎన్ని జరుగలేదు! దేవుడొకసారి చెప్పినప్పుడు దాన్ని మరొకసారి ఆయన చెప్పనక్కరలేదు. అయినను లేఖనములను బట్టి పై అంశమునకు బలము చేకూర్చుదము. అపొ.కా. 10:34, 35 లో ఇట్లు వ్రాయబడి యున్నది: "అందుకు పేతురు నోరు తెరచి ఇట్లనెను-దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును". ఆదిమ సంఘము తమ సహవాసములోనికి సున్నతి పొందిన సమరయులను అంగీకరించుటలో తాము వెళ్ళవలసినంత మట్టుకు వెళ్ళితిమని తలంచిరి. దేవుని నుండి కలిగిన ఈ బయల్పాటుకు తోడుగా మరొక లేఖనమును చూద్దాం. "కావున ఇకమీదట మేము శరీర రీతిగా ఎవనినైనను ఎరుగము; మేము క్రీస్తును శరీర రీతిగా ఎరిగియుండినను ఇకమీదట ఆయనను ఆలాగు ఎరుగము" (2 కొరింథీ 5:16). రక్షింపబడాలంటే ఒకడు సున్నతిపొంది మోషే ధర్మశాస్త్రము ననుసరించాలని బోధించిన వారుండిరి (అపొ.కా. 15:1). పరిశుద్ధాత్మని శక్తివలన పేతురు ఇట్లనుచున్నాడు: "మరియు హృదయములను ఎరిగిన దేవుడు మనకు అనుగ్రహించినట్టుగానే వారికిని పరిశుద్ధాత్మను అనుగ్రహించి వారిని గూర్చి సాక్ష్యమిచ్చెను. వారి హృదయములను విశ్వాసము వలన పవిత్రపరచి మనకును వారికిని ఏ భేదమైనను కనుపరచలేదు" (అపొ.కా. 15:8, 9). మనము పైన చూచినట్లు దేవుని వాక్యము విపులముగా బోధించుచున్నను ఈ అబద్ధ బోధకులు తమ అబద్ధ బోధను

వ్యాప్తి చేయసాగారు. వారు తమ అబద్ధ బోధలో ఎంత కృతకృత్యులయ్యారంటే పేతురును, బర్నబాను కూడా వారు మోసగించారు (గలతీ 2:11-13). మనుష్యులందరు దేవుని యెదుట సమానులే, సమాన షరతులపైననే అందరు అంగీకరించబడుదురని చూపించుట కొరకు గలతీ, హెబ్రీ పత్రికలు, రోమా పత్రికలో కొంతమట్టుకు వ్రాయబడినవి. ప్రపంచములో యున్న దేశాలకు సువార్త ప్రకటించుచున్న మనము దాని నంగీకరించుచున్నామా ?

అమెరికా ఖండములో యున్న మాలో అనేకులు ఆంగ్ల జాతీయులలో నుండి వచ్చినవారు.' క్రీస్తు ఈ లోకానికి వచ్చుసరికి మేము అన్యులము. అనేక శతాబ్దముల వరకు మేము ఈ దుఃఖకరమైన స్థితిలో యుంటిమి. మా పూర్వీకులు నరబలుల నర్పించేవారు. క్రీస్తు మా పూర్వీకులకు బోధింపబడెను. తద్వారా వారిలో గొప్ప మార్పులు సంభవించెను. క్రీస్తును మా క్రీస్తుగా మేమంగీకరించాము. ఇది సరియేగాని, ప్రత్యేకంగా క్రీస్తు మాకే చెందునని తలంచుటలో మేము పొరబడ్డాము. అందువలన క్రీస్తు సువార్తను ఇతర జనాంగములకు మనం తీసుకెళ్ళ నక్కర లేదని అనేకులు బోధింపసాగారు. అయితే సర్వజనాంగములకు సువార్త బోధింపబడాలనే వాస్తవాన్ని ఎరిగిన వారు అంగీకరించినవారు కొందరుండుటచే దేవునికి మనం కృతజ్ఞత లర్పింపవలసి యున్నది (మార్కు 16:15).

## పాశ్చాత్యుల మతం మతశాఖల తత్వం

అయితే మరొక అపోహతో మనం నిండి యున్నాము : అది శ్వేత జాతీయులు మిగతా జాతులకంటె శ్రేష్టులు అనునది. ఈ ఇతర జాతులవారు తమ్ము ను తాము పాలించుకొనుట ఎరుగరు గనుక వారిని పాలించే బాధ్యత శ్వేత జాతీయునిదైనది. ఇట్టి భావాలలోనికి ఆధునిక మిషనరీల కృషి ఆరంభమైనది. భారత దేశంలో మిషనెరీలు చాల గొప్ప మేలును చేసారనుటలో సందేహంలేదు. అయితే హిందువులు దాన్ని

చూచి క్రైస్తవ్యము మంచి మతమేగాని అది పాశ్చాత్యుల మతమని, మన మతం హిందూమతమని చెప్పాను. అయితే హిందువుడు పొరబడ్డాడు. క్రైస్తవ్యము పాశ్చాత్యులది కాదుగాని డినామినేషన్లు పాశ్చాత్యులవే. మతశాఖల తత్వము పాశ్చాత్యుల మతము. దాన్ని హిందువుడు చూచి క్రైస్తవ్య మనుకొన్నాడు. అదే క్రైస్తవ్యమని వారు చెప్పుకొన్నారు. అందువలన అమెరికన్ బాప్టిస్టు మిషన్‌యొక్క హెడ్ క్వార్టర్ (కేంద్రాలయము) ఇంకా పెన్సిల్వేనియాలోని వేలీ ఫోర్జ్‌లోనే యున్నది. కెనేడియన్ బాప్టిస్టు మిషన్‌యొక్క కేంద్రాలయం ఇంకా టొరాంటోలోనే యున్నది. డినామినేషన్ల లిస్టునంతటినీ మనం పరిశీలిస్తే దానిలో ప్రతి ఒక్కటి పాశ్చాత్యులదే యని గమనించగలము.

మనం క్రొత్త నిబంధన మాదిరి ననుసరించిన యెడల ఎక్కడికి వెళ్ళినను మనం అక్కడ క్రీస్తు సంఘములను స్థాపించెదము. అంతియొకయలో కొందరు కాందిశీకులు అదే పనిని చేసిరి (అపొ.కా. 11:26). దేవతార్చన, విగ్రహారాధన చేయు ప్రజల మధ్యకు పరిశుద్ధాత్ముడు సువార్తికులను పంపినప్పుడు వారు సంఘాలను స్థాపించారుగాని డినామినేషన్లను కాదు (అపొ.కా. 14:23). వారు ఆసియాను వీడి యూరపుకు వెళ్ళిరి. ఫిలిప్పయిలో వారొక సంఘాన్ని స్థాపించిరి (ఫిలిప్పీ 4:15). బహు పేదరికములో యున్న థెస్సలొనికయలో కూడ వారొక సంఘాన్నేగాని డినామినేషన్‌ను స్థాపించలేదు (I థెస్స 1:1).

దేవుడు తెల్లవారికొక చట్టము మిగిలిన వారికింకొక చట్టము నీయలేదు. క్రొత్త నిబంధన యేమైనా బోధించుచున్న యెడల అది మానవులందరు దేవుని యెదుట సమానులే యని బోధించుచున్నది. కొందరు స్వదేశములో యున్నవారినేగాని విదేశాలలోని స్థానిక బోధకులకు సపోర్టు ఈయరాదంటారు. దేవుడు పక్షపాతియా? లేక మనం ఏదో ఒక మానవ చట్టాన్ని బట్టి పాలింపబడుచున్నామా? విదేశాల

లోని స్థానిక బోధకులకు సపోర్టు ఈయరాదనేది ఒక హాబీ మాత్రమే. మిగిలిన హాబీలకంటే అది ఏమంత శ్రేష్ఠమైనది కాదు.

— జె. సి. బెయిలీ

---

## దేవునియందు విశ్వాస ముంచుట

### *( Believing in God )*

దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడని నమ్మవలెనని బైబిలు చెప్పుచున్నది (హెబ్రీ 11:6). దేవుడున్నాడని సాధారణంగా అనేకులు నమ్ముదురు. "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" అని బైబిలు చెప్పుచున్నది (కీర్తన 14:1). అయితే దయ్యములు కూడ దేవునియందు విశ్వాస ముంచుచున్నవని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 2:19).

ఈ లోకాన్నంతటినీ జ్ఞానయుక్తముగా సృజించి, మానవుని ఈ భూమిపై యుంచిన గంభీరశక్తి యొకడున్నాడని మన సామాన్య జ్ఞానమే మనకు తెలియజేయును. ఇదంతయు ఒక ఆకస్మిక సంఘటన వలన గాక ఒక మహాజ్ఞానివలన సృజింపబడెనని తెలిసికొనుటకు మనకు సొలొమోనుకున్నంత జ్ఞానం ఉండనవసరంలేదు.

"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది" యని బైబిలు బోధించుచున్నది. (కీర్త 19:1). దేవునియందు, క్రీస్తునందు కేవలం నమ్మిక యుంచితే అది మోక్షానికి వెళ్లుటకు సరిపోదు. విశ్వాసమనునది కేవలం మానసిక ఆమోదము కంటె ఎక్కువైనది. మన విశ్వాసంలో సంపూర్ణ నమ్మిక యుండాలి. సత్యానికి సంపూర్ణంగా లోబడే మూలికలుండాలి.

దేవుని మంచితనంలో యున్న విశ్వాసం పాపములను గూర్చి మారుమనస్సు పొందేటట్లు ఒకని ప్రోత్సహించును (రోమా 2:4).

విశ్వాస ముంచుటవలన దేవుని కుమారులమయ్యే స్థానంలో మనం ఉండగలము (యోహాను 1:12). బాప్తిస్మము మనలను క్రీస్తులో ఉంచును (గలతీ 3:26).

విశ్వాస ముంచుటలో సమస్తానందము సమాధానము ఉన్నదని బైబిలు చెప్పుచున్నది (రోమా 15:13). విశ్వాసముంచుటలో క్రొత్త నిబంధనలోని ఆజ్ఞలకు విధేయులగుట ఇమిడియున్నది. విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలునను బోధను ఎన్నడు అంగీకరించవద్దు. అది ప్రభువు కోరుదానికంటే తక్కువైనది. పరిశుద్ధ గ్రంథములో అది బోధింపబడలేదు.

నీవు విశ్వసించినయెడల నీ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (అపొ.కా. 3:19), క్రీస్తును ఒప్పుకొనవలెను (యోహాను 12:42; మత్త 10:32), బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16; అపొ.కా. 2:38), పరిశుద్ధులతో ఆరాధింపవలెను (అపొ.కా. 20:7; హెబ్రీ 10:25). మరియు అన్నింటిలోను నమ్మకముగా యుండవలెను (ప్రక 2:10; 1 కొరింథీ 4:2).

---

## క్రీస్తు సంఘమనగా నేమి?

1. క్రీస్తు సంఘమంటే క్రీస్తుయొక్క సంఘము. ఆయన కట్టుదునని వాగ్దానం చేసిన సంఘము. శిరస్సుగా ఆయన దాన్ని పాలించుచున్నాడు (రోమా 16:16; మత్తయి 16:18; కొలస్స 1:18).
2. క్రీస్తు సంఘమే క్రీస్తు శరీరము (ఎఫెసీ 1:22, 23; 5:23).
3. క్రీస్తు సంఘమనగా క్రీస్తు దానికొరకు తన ప్రాణ మర్పించిన సంఘము (ఎఫెసీ 5:23).
4. క్రీస్తు సంఘమే దేవుని మందిరము, దేవుని కుటుంబము (1 తిమో 3:15; ఎఫెసీ 3:10-15).

5. క్రీస్తు సంఘమే సత్యానికి స్తంభము, ఆధారము (1 తిమో 3:15; ఫిలిప్పీ 1:17).

6. క్రీస్తు సంఘమనగా క్రీస్తుయొక్క వధువు (రోమా 7:4; ఎఫెసీ 5:23-33; ప్రక 21:2, 9).

7. క్రీస్తు సంఘమనగా క్రీస్తుచే పిలువబడినవారు (2 థెస్స 2:14; 2 తిమో 1:9; హెబ్రీ 3:1).

8. క్రీస్తు సంఘమే దేవునిచే రక్షింపబడిన వారి సమూహము (అపో.కా. 2:47).

9. క్రీస్తు సంఘమనగా మన రక్షకుని స్వంత రక్తముచే కొనబడిన సంఘము (అపో.కా. 20:28).

10. మనం క్రొత్త నిబంధనలో చదువగలిగిన సంఘమే క్రీస్తు సంఘము. ★

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................

..............................

..............................

..............................